# గలగలా గోదారి

భైరవయ్య



తాపీ మేస్త్రీ తవిటయ్య

'**త**విటయ్యా' అని పిలిచాడోయ్ కామశాస్త్రి. ఆయన మట్టి అరుగుమీద తాటాకు చదరమీద కూర్చుని వున్నాడు. తవిటయ్యాని పిలవడానికి ముందు, రెండు నాసికారంధ్రాల్లోంచి నషాళానికి అందేలా పొడుంపట్టు పట్టాడు. సమపాకంలో రంగరించబడ్డ ముక్కుపొడుం తాలూకు ఆనందం ఆయన ముఖంలోనూ, ఆయన పిలుపులోనూ కూడా వుట్టిపడిందోయ్.

పిలిస్తే కాని వినపడనంత దూరం ఏమీ లేదు. తవిటయ్యా కామశాస్త్రికి రెండు బారల దూరంలో, అరుగు కిందిమెట్టు మీద, ఒక కాలు మడిచి, నేలమీద పుల్లతో గీతలు గీస్తూ లెక్కలు కడుతున్నాడు. కామశాస్త్రి పిలుపుకి ఆయ్ అంటూతలెత్తి, ఆయన చేతిలో వెండి పొన్నకాయని చూసి, తనూ వంగి చెయ్యి ముందుకు చాచాడు. 'తవరి పొడుం రుచి మరెవరికి రాదండి' అంటూ.

''మరే మొన్న తాసీల్దారుగారు కూడా ఆమాటే అన్నార్రా. కరణం చిన్న బుచ్చుకున్నాడు స్మీ.'' అంటూ పొన్నకాయ తవిటయ్య కందించాడాయన.

ఆవూరు మొత్తం పన్నెండు వందల గడప. అందులో ఒకటి మేడ. అది పెద్దరాజుగారిదోయ్. అరడజను పెంకుటిళ్ళు. అందులో ఒకటి కరణందిలే. పెద్ద అరుగులతో, తాటాకు కప్పుతో, మట్టిగోడలతో వున్నవి ఇరవై. అందులో ఒకటి కామశాస్త్రిదేలే. మిగతా వన్నీ సాదావి. అన్నీ తాటాకు గుడిసేలేనోయ్.

రాజుగారి మేడ దగ్గర్నుంచి, పెద్ద అరుగుల మట్టియిళ్ళ వరకూ, తవిటయ్యో,అతని పూర్వీకులో కట్టినవేనోయ్. ఆ వూరికి తాపీ మేస్త్రీ, వడ్రంగీ కూడా తవిటయ్యే. తవిటయ్య కట్టిన ఇల్లు కలకలలాడుతుందని ఆ వూర్లో అందరికీ నమ్మకం. మోకాళ్ళదిగని నీరు కావి పంచె, తలకి చుట్టుకోడానికి బుజంమీద కప్పుకోడానికి పనికి వచ్చేలా వున్న కండువా, ముక్కున కాడ, మూతి మీద ఒత్తుగా బుంగ మీసాలుతో చెయ్యెత్తు మనిషోయ్ తవిటయ్య. కట్టినప్పుడు ఇళ్ళుకట్టడం, మిగతా సమయంలో వూరిక్కావలసిన వడ్రంగి పని చెయ్యటం తవిటయ్య పని. తవిటయ్య కట్టిన ఇల్లు ఇల్లులా వుండదోయ్. అది గృహంలా వుంటుంది. ఆ ఇంట పచ్చతోరణం మాయదు.

పనిలో కాల నిర్ణయాన్ని తవిటయ్య సహించడోయ్. 'ఫలానా సమయానికి పూర్తి చెయ్యాలి తవిటయ్యా.' అన్న సూచనే తప్ప, ఫలానా సమయానికి పూర్తి చేసి తీరాలి' అనే శాసనం తవిటయ్యకులేదోయ్. పెద్ద రాజైనా అంతే. పెద్ద పాలేరైనా అంతే. అలా అని అశ్రద్ధ చేస్తాడని కాదోయ్. అదతని నియమం. ఆ నియమాని కందరూ బద్దులే. ఎందుకేమిటోయ్ అతను ఇల్లు కట్టినా, నాగలి చెక్కినా, కుర్చీపీట చేసినా, అదొకదీక్ష, ఒక రచన, ఒక సృష్టి. మనం చెప్పలేని విలక్షణతేదో వుంటుందోయ్. ఏ ఒకటీ, మరోదానిలా వుండదు. దేనికదే బావుంటుంది. 'అనిర్వచనీయము' అనే పదం విన్నావు గదా. తవిటయ్య పనితనంలో అది కనిపిస్తుందోయ్.

తవిటయ్య పనికి మూల్యంలేదోయ్. రైతులందరూ సాలీనా ఒడ్లు కొలవడమే. ఎవడి శక్తిని బట్టి వాడు నిర్ణయించుకోవలసిందే. ఇంత కావాలని తవిటయ్యడగడోయ్. అతను కావాలని అడిగేవి అతి చిత్రంగా వుంటాయనుకో ఒక పట్టు ముక్కు పొడుమో, ఒక అత్తం అమృతపాణో, వూరంతా గుబాళించేట్టు కాచిన గిన్నెడు పప్పు చారో, నేతి పెసరట్లో - అలా వుంటాయి అతని కోరికలు.

అలాంటి తవిటయ్యని, 'తవిటయ్యా' అని పిలిచాడు కామశాస్త్రి.

'ఆయ్' అన్నాడు తవిటయ్య.

'ఏమిటంటావు'

అలాగేనండి అనేందుకే వుందండి. తవరు చెప్పినట్టే చేద్దారండి. వైశాఖానిగ్గదండీ. కట్టేదావండి. అన్నీ సిద్దంగా వున్నాయంటున్నారు గదండీ. ముహూర్తంగ్రటా పెట్టి, తాంబూల విప్పించండి. పని ప్రారంభించేద్దారండి.''

సరే అయితే. ఓసారి అవధానిగారితో మాట్లాడి ముహూర్తం సంగతి రేపు చెబుతాను.''

''ఆయ్ మరండి పనిపూర్తయ్యాకండి నాదో చిన్నమనవండి.''

''ఏవిట్రా అది''

''అబ్బే. ఏంలేదండీ. మీరు కొత్తింట్లోకి ప్రవేశిత్తారుగదండీ ఆరోజండి ... '' అని తన మనసులో మాట చెప్పాడోయ్ తవిటయ్య.

అది విన్న కామశాస్త్రి ఫెళ్ళున నవ్వాడోయ్ ''అంతేనా అదో బ్రహ్మ ప్రళయమా'' అంటూ.

''ఆయ్. శాన్నాళ్ళనుంచుండిపోయిందండి. సందర్భం కలిసి రావాలి గదండి. అంతేనండి. అది చాలండి.'' అన్నాడోయ్ తవిటయ్య కొంచెం సిగ్గుపడుతూ.

ఆవూళ్ళో అక్షరముక్క తెలిసిన నలుగురైదుగుర్లో కామశాస్త్రి ఒకడోయ్. తాతలనాటి మడిచెక్కని కాపాడుకుంటూ, లౌక్యంలో పడి దస్తావేజులు, తనఖాపత్రాలు రాయడం నేర్చుకున్నాడు. వేన్నీళ్ళకి చన్నీళ్ళసాయంలా నాలుగు డబ్బులు వెనకేసుకున్నాడోయ్. లోభికాదుగాని, అవసరాన్ని మించి ఖర్చు చెయ్యడు. పెట్టవలసొచ్చినప్పుడు బాధపడడోయ్.

ప్రస్తుతం కామశాస్త్రి వుంటున్న ఇల్లు వాళ్ళ తాత హయాంలో కట్టినటువంటిది. పెద్ద అరుగులతో, పైనతాటాకు కప్పుతో కట్టిన మట్టి గోడల ఇల్లు. ఆ ఇల్లు మార్చి వాసాలు, స్తంభాలతో పెంకుటిల్లు వేసుకోవాలని అతనికి మనసులో వుందనుకో. అందులోనూ నాలుగు రాళ్ళు వెనకేసుకుని పెద్ద కుటుంబాల వాళ్ళలో ఒకడయ్యాడాయ్. ఖర్చుకి కొంచెం జంకి ముందడుగెయ్యలేకపోతున్నాడోయ్.

ఈవూగిసలాటలో కామశాస్త్రి వుంటుండగా, కచేరీ పనిమీద తాసీల్దారు ఆవూరొచ్చాడు. ఆ వచ్చిన తాశీల్దారుని, కరణం ఇంట్లో కలిసినప్పుడు. 'ఆపూరిల్లు వదలవేమిటోయ్ ఆవాల ముద్దంతా మూటగట్టి ఏం చేస్తావయ్యా' అని, తాసీల్దారు ఎదురుగుండా కరణం మేలమాడాడు. అందులోపరాచకం కన్నా, ఎగతాళి ఎక్కువగా ధ్వనించిందోయ్ కామశాస్త్రి చెవులకి.

ఆమర్నాడే తవిటయ్యకి కబురు పెట్టడం తన మనసులో వున్న ఆలోచన చెప్పడం జరిగిం

దోయ్. కూచున్నచోటే, నేలమీద గీతలు గీసి కామశాస్త్రిఆలోచనకి రూపకల్పన చేసాడు తవిటయ్య. నిర్ణయాలు నిబంధనలు పూర్తయ్యాయి. అవధానిగారిని కలుసుకుని, ముహూర్తం నిర్ణయించుకుని, తవిటయ్యకి తాంబూలమివ్వడమూ, తను వేరే యింట్లోకి కాపరం మార్చడం జరిగిపోయిందోయ్.

అదోయ్ అలా జరిగింది. కామశాస్త్రి యొక్క యిల్లు కట్టడం ప్రారంభించాడు తవిటయ్య.

మట్టిగోడలు తవ్వి పునాదులు తీసారు. చెక్క సున్నం ఆడించారు. ఇటుకలు సిద్ధమయ్యాయి. రాజమండ్రం నుంచి కాలవలో ఈదుకుంటూ వచ్చిన టేకు దూలాలు ఎండాయి. ద్వారబంధాలు, కిటికీలు, తలుపులు సిద్ధమయ్యాయి. సింహద్వారం లేపారు.

ఆ సింహద్వారంలో, తవిటయ్య మెరిసాడోయ్ అణువణువునా. ఆలతలు, ఆలతలకి పువ్వులు, ఆ పువ్వుల మీద తుమ్మెదలు - దారు శిల్పం నిర్వచింపబడిందోయ్.

విశాలంగా, గచ్చు చేసిన అరుగులు. ఆ అరుగుల మీద, కప్పుకాధారంగా స్తంభాలు అవి స్తంభాలా కావోయ్. తవిటయ్య చేతుల్లో అవి సజీవాలు కాదుటోయ్. శిల్పకళకి ఒరవళ్ళు కావుటోయ్ అవి.

అలా ... అలా ఇల్లు పూర్తవుతూ వచ్చిందోయ్

రోజూ ఏదో సమయంలో కామశాస్త్రి వచ్చేవాడు. వస్తూనే తవిటయ్యకి వెండి పొన్నకాయ అందించేవాడు. ఓపట్టు పట్టి తవిటయ్య నవ్వేవాడు. కొంతసేపుండి కామశాస్త్రి వెళ్ళిపోయేవాడు. పోతూ, మరోసారి పొన్నకాయ అందించేవాడు. అంతే మాటలేవీ వుండేవి కావు. మాటలెందుకోయ్.

గృహ ప్రవేశానికి ముహూర్తం నిర్ణయించడమయింది. అట్టహాసంగా కొత్త ఇంట్లోకి ప్రవేశించాడు కామశాస్త్రి. వూళ్ళో వాళ్ళని, చుట్టుపక్కల చుట్టాల్నీ, అందర్నీ పిలిచాడు. వడ్డనలయ్యాయి. అందరూ హాస్యాలాడుకొంటూ విస్తళ్ళమీద పడ్డారు.

వేరే గదిలో, ఎనిమిదరటాకులు ఒకటిగా కుట్టిన విస్తరి ముందు తవిటయ్య ఒక్కడూ కూచుని వున్నాడు. కామశాస్త్రి, అతని భార్య - వేడి కళాయిని దళసరి గుడ్డతో పదిలంగా పట్టుకుని వచ్చారు.

"తవిటయ్య ఇదిగో నువ్వడిగిన కట్నం. సంతృప్తిగా స్వీకరించు." అన్నాడోయ్ కామశాస్త్రి.

ఆ కళాయిని చూడగానే తవిటయ్య కళ్ళు మెరిసాయోయ్.

దాని నిండుగా కుంచెడు కొత్త బియ్యంతో, బంగారు తీగె బెల్లంతో, స్వచ్ఛమైన ఆవుపాలతో వండిన పాయసం వుందోయ్. అందులో జీడిపప్పు బాదంపప్పు సమపాళ్ళలో వున్నాయి. నాభి నుంచి జిహ్వామీద వరకూ వున్న గ్రంధులన్నీ చవులూరేలా వుందోయ్. ఆ పాయసాన్ని, తవిటయ్య ముందున్న విస్తరిలో పదిలంగా వడ్డించారు. భర్యాభర్తలిద్దరూ. ఆరాశికి నమస్కరించి, వేళ్ళతో నాగేటి చాళ్ళులా తీసాడు తవిటయ్య. ఆ చాళ్ళు, నిండి పోర్లేట్టుగా ఘుమఘుమలాడుతున్న ఆవునెయ్యి ఆప్యాయంగా పోసాడోయ్ కామశాస్త్రి.

ఆయ్ చాలండి బాబయ్య. ఆనందంగా వుండండి. పది కాలాలపాటు పిల్లా పాపల్తో సుకంగా వుండండి. అని మనస్ఫూర్తిగా, చెమర్చిన కళ్ళతో అన్నాడోయ్ తవిటయ్య.

ఆ దంపతులిద్దరూ తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయారోయ్.

చాలా రోజులుగా వున్న కోరిక ఆ రోజు తీరిందోయ్ తవిటయ్యకి. అంతేనోయ్. ఆ రోజుల్లో సంతృప్తే ముఖ్యమోయ్. అంతేనేయో అంతే. *





దొరుకుచోట్లు

1. డా. వుళ్ళక్కి స్ట్రీట్, తెనాలి, ఫోన్.3150; 2. మాజేటి వీరరాఘవయ్య, శోభనాద్రి లేన్, విజయవాడ, ఫోన్.73567; 3. 1-3-166 రాజా మొదలియార్ స్ట్రీట్, కలాసిగూడ, సికింద్రాబాద్, ఫోన్.76160; 4. కోట శీతారామాంజనేయులు & కో., ఒంగోలు; 5. శ్రీరామకృష్ణ ట్రేడర్స్, నంద్యాల, ఫోన్.544; 6. రఘురామచంద్ర జనరల్ స్టోర్సు, నంద్యాల; 7. గుండా చినవెంకయ్యశెట్టి, 9/11 మెయిన్‌రోడ్, గుంతకల్-515501, ఫోన్. 335; 8. యొజ్జు నాగేంద్రం, గుంటూరు మరియు అన్ని ప్రముఖ కిరాణాషాపులు; 9. ప్రిన్స్ & కో., అన్ని బ్రాంచీలు, కాకినాడ. ఫోన్.4777; 10. చుండ్రు నరసింహం 'స్టోన్‌హౌస్‌పేట', నెల్లూరు; 11. అన్నపూర్ణా ట్రేడర్సు 145, అన్నాపిళ్ళై స్ట్రీట్, మద్రాస్. ఫోన్.23095; 12. యిమ్మిడిశెట్టి రామకృష్ణయ్య & సన్సు, బరంపురం, ఫోన్.2043; 13. శాంతిలాల్ చున్నీలాల్, యితవారీ, నాగపూర్, ఫోన్.42316, 42340; 14. బాలాజీ ట్రేడింగ్ కంపెనీ, 25, లేక్‌రోడ్, కలకత్తా, ఫోన్.461960.